

రెప్పల మీద నీడలు

– అత్తలూరి విజయలక్ష్మి



(గత సంచిక తరువాయి)

20

అతని స్వరం పులి గాండ్రింపులా... సింహం గర్జింపులా... పెద్ద కొండ చరియలు విరిగి పెద్ద శబ్దంతో తన నెత్తి మీద పడుతున్నట్టుగా వినిపించి పవిత్ర గుండె ఆగిపోయినట్టు అనిపించింది.

చలిజ్వరం వచ్చినదానిలా వణికిపోయింది. అడుగు ముందుకు పడలేదు. ఏదో సినిమాలో శాపవశాత్తూ పాషాణంలా మారుతున్న నటుడుకి పాదాలు ముందుగా చలనం కోల్పోయినట్టు ఆమె పాదాలు చలనం కోల్పోయాయి. పాషాణం లాగానే నిలబడిపోయింది.

"నమస్కారం మావయ్యగారూ! ఎలా ఉన్నారు? కులాసానా అత్తయ్యగారూ!" మాటలో అతి వినయం... ధ్వని మాత్రం కర్ణకఠోరం.

కొద్దిసేపు మౌనం గిరికీలు కొట్టింది ఆ విశాలమైన హాల్లో. తరవాత నెమ్మదిగా మాధవ స్వరం వినిపించింది. "ఆ, ఆ బాగున్నాం. మీరెలా ఉన్నారు? కూర్చోండి."

నాన్నేంటి ఇంత మర్యాదగా మాట్లాడుతున్నాడు. విస్తుబోయింది పవిత్ర. ఆయన కోపం వస్తే ఏం చేస్తాడో ఆయనకే తెలియదు. అలాంటిది, ప్రాణానికి ప్రాణం లా పెంచుకున్న కూతురుని అతను నిరాదరిస్తున్నాడని, మానసిక క్షోభకి గురిచేస్తున్నాడని తెలిసి కూడా, తెలిసి పావుగంట కూడా కాకుండానే, తెలిసిన వెంటనే కలిగిన ఆవేశం, కోపం చల్లారకుండానే... ఇంత మర్యాదగా పలకరించడం ఎలా సాధ్యం?

"ఏంటి మావయ్యగారూ! మీ అమ్మాయిని మరీ అలా పెంచారు. ఇంత చిన్నపిల్ల అని పెళ్ళయ్యాక కానీ తెలియలేదు." అని అంటూ మధ్యలో మాట ఆపి గట్టిగా నవ్వాడు శివ.

తిరిగి మాట్లాడుతూ, "అసలు లోకజ్ఞానం లేదు, ఏమి తెలియదు... చెబితే అర్థం చేసుకోదు. ప్రతి దానికీ ఏడుస్తుంది. నిన్న నేనేదో చిన్న మాట అన్నానని అలిగి చెప్పా చెయ్యకుండా వచ్చేసింది మీ దగ్గరకి. ఇంటికి వచ్చి, తను లేకపోయేసరికి మతిపోయింది నాకు. హాస్పిటల్ లో రోగులతో ఊపిరి సలపదు. తన గురించి ఎంతసేపు ఆలోచించగలను చెప్పండి. ఇంత అమాయకత్వం... అమాయకత్వంతోపాటు పొరుషం... ఈవిడతో వేగాలంటే నాకు కౌన్సిలింగ్ కావాలి". మళ్ళీ నవ్వాడు.

ఎవరూ మాట్లాడలేదు.

"ఏం చేస్తోంది? ఇంకా నిద్ర లేవలేదా? తీసుకుని వెళ్దామని వచ్చాను. చాలా బిజీగా ఉన్నాను. వెళ్ళిపోవాలి. తనకోసమే రాత్రికి రాత్రి బయలుదేరి వచ్చాను. పైకి వెళ్ళనా?"

అతని మాటలు పూర్తికాకుండానే నాంచారమ్మ స్వరం వినిపించింది. "పవిత్రా!" అని పవిత్రని పిలిచి, అతనితో అంది "లేచింది.., స్నానం చేస్తున్నట్టుంది. మీరు కూర్చోండి. వర్ధనీ! అల్లుడికి కాఫీ ఇవ్వు."

వర్ధని వంట గదిలోకి వెళ్తున్నట్టు ఆవిడ అడుగులకి లయబద్ధంగా కదిల్తున్న పట్టీల శబ్దం వినిపించింది.

పవిత్ర నెమ్మదిగా తనను తాను నిలదొక్కుకుని, కదిలి బాత్ రూమ్ లోకి వెళ్ళింది. బ్రష్ చేసుకుని, గబగబా ఒంటి మీద నీళ్ళు పోసుకుని, బట్టలు మార్చుకుని, జుట్టు సర్దుకుంటూ మెట్లు దిగి కిందకి వచ్చింది.

శివ, మాధవరావు సోఫాల్లో ఎదురెదురుగా కూర్చుని ఉన్నారు. ఎవరూ మాట్లాడుకోడం లేదు. నాంచారమ్మ మాత్రం శివాని ఏదో అడుగుతోంది. అతను నవ్వుతూ సమాధానం చెప్తున్నాడు.

"బాబాయ్ ఉద్యోగం టూర్లు తిరిగే ఉద్యోగం బామ్మగారూ! పిన్ని ఒక్కతే ఉండలేదు. ఆవిడకి నరాల బలహీనత ఉంది. చూడ్డానికి ఆరోగ్యంగా కనిపిస్తుంది కానీ, ఆవిడకి చాలా జబ్బులున్నాయి. అందుకే నా దగ్గరకు వచ్చేస్తుంది బాబాయి లేకపోతే. నేనే వెళ్ళచ్చు వాళ్ళింటికి కానీ, నా హాస్పిటల్, రోగులు నా గొడవ నాది... మీ మనవరాలికి ఆవిడ అంటే పడదు. అయినా, మీ కాలం కాదుగా అత్తగారు, మావగారిని గౌరవించడం ఈకాలం అమ్మాయిలకి తెలియదు. ఆవిడ ఎందుకు మనింట్లో పానకంలో పుడకలాగా అని కాపురం పెట్టిన దగ్గర నుంచి గొడవే " పవిత్ర రాకతో అతను మాట్లాడడం ఆపేసి ఆమె వైపు చూసాడు. అతని వేపు చూసిన పవిత్రకి ఆ కళ్ళల్లో నవ్వు కనిపించింది కానీ, ఆ నవ్వులో క్షణంలో సగం సేపు కనిపించి మాయమైన క్రూరత్వం ఆమె గుండెల్లో దడ పుట్టించింది.

"ఏంటి పవిత్రా! అలా చెప్పా చేయకుండా వచ్చేస్తే నేనేమైపోతాను అనుకున్నావు. ఎంత కంగారు పడ్డానో తెలుసా! ఆ వెంకటమ్మని అడిగితే నాకు తెలియదు అని అంటుంది. ఎవరిని అడగను? ఏం చేయను? అయినా చిన్నపిల్లలా అలకలేంటి? నేనేమన్నా అంటే నాతో మాట్లాడాలి. నాకు ఇది ఇష్టం లేదు అని నీకేం ఇష్టం లేదో చెప్పాలి. నేను నీ భర్తని పవిత్రా! నా దగ్గర భయమేంటి? ఇలారా కూర్చో" తన పక్కన సోఫాలో చోటు చూపిస్తూ పిలిచాడు.

పవిత్ర నాంచారమ్మ వైపు చూసింది. ఆవిడ పవిత్రని కాదు, శివాని చూస్తోంది. ఆవిడ చూపుల్లో అనేక ప్రశ్నలు, సందేహాలు.

పవిత్ర తండ్రి వైపు చూసింది. ఆయన శివ వైపు అయోమయంగా చూస్తున్నాడు. ఇతను దుర్మార్గుడా? పవిత్ర ఉత్తినే భయపడిందా? లేక అనుమానమా? పవిత్ర చెప్పినట్టు స్వంత పిన్నితో అక్రమ సంబంధం పెట్టుకునేంత నీచుడిలా కనిపించడం లేదు. పవిత్ర మీద ఎంత ప్రేమ ఇతనికి! పవిత్రలో నిజంగానే పసితనం పోలేదు. నిజమే! మైనర్ కూడా అవకుండా పెళ్లి చేసాడు. తను చేయాలని అనుకోలేదు. త్వరపడి పెళ్లి చేసే పరిస్థితి పవిత్ర కల్పించింది. ఈ కాలం

అమ్మాయిలూ అత్తగార్లని రాక్షసుల్లా భావిస్తున్నారు. పవిత్రకి చెప్పాలి. తను వెళ్ళింది ఒక ఇంటికి కాదు, ఒక కుటుంబంలోకి అని. ఆ కుటుంబం లో అత్తగారు, మావగారు, పిన్నట్టలు, పిన మావగార్లు అందరూ ఉంటారని.

ఆయన తలతిప్పి పవిత్ర వైపు చూసాడు.

పవిత్ర గుడ్లు అప్పగించి అటూ, ఇటూ చూస్తోంది. జాగ్రత్తగా చూస్తే, ఆ చూపుల్లో నన్నెవరన్నా ఆదుకోరూ అనే అభ్యర్ధన కనిపిస్తుంది. కానీ అదేమీ గమనించని మాధవ మృదువుగా అన్నాడు. "కూర్చోమ్మా".

అసలు విషయం తెలియని నాంచారమ్మ అల్లుడి మంచితనం, హుందాతనం, ఆ అందమైన పర్సనాలిటీ చూస్తూ "నా చిట్టితల్లికి తగిన మొగుడు" అనుకుంటోంది.

వర్ధని కాఫీ కప్పులతో వచ్చింది. శివ కాఫీ కప్పు అందుకుని, పవిత్ర వైపు చూసి, "రా పవిత్రా! కాఫీ తాగుదాం" అన్నాడు.

వర్ధని అతని వైపు ఆశ్చర్యంగా, పవిత్ర వైపు అయోమయంగా చూసింది.

"వెళ్ళమ్మా. కూర్చో" అన్నాడు మాధవ.

పవిత్ర నిద్రలో లేచి నడిచే వెళ్ళే రోగిలా అతని వైపు నడిచింది.

ఆమె చేయి పట్టుకుని తన పక్కన కూర్చోబెట్టుకుని కాఫీ కప్పు ఆమె చేతికి అందించి, చెదిరిన జుట్టు సరిచేస్తూ "పిచ్చిపిల్ల. బాధపడ్డావా? ఒక చిన్న చెంపదెబ్బ వేసాను... ఏదో టెన్షన్ లో. ఆ మాత్రానికే ఇల్లు వదిలి వస్తే నేనేం కావాలి?" అన్నాడు.

ఆ స్వరంలో వినిపించిన వేదనకి అక్కడ ఉన్న మాధవ, నాంచారమ్మ చాలా బాధ పడ్డారు. వర్ధని కళ్ళల్లో ఆశ్చర్యం పోలేదు. పవిత్ర మాత్రం మనసులో ఎంత నటిస్తున్నావురా నాయనా అనుకుంది.

శివ మాధవ వైపు చూస్తూ అడిగాడు"మావయ్యగారూ! మీ పెళ్లి అయిన కొత్తల్లో మీరూ అత్తయ్యగారూ కోపంతో ఒకరినొకరు ఏమి అనుకోలేదా? ఎప్పుడూ దెబ్బలాడుకోలేదా? అసలు భార్యాభర్తలు అన్నాక దెబ్బలాటలు కీచులాటలు, ప్రేమ కలహాలు లేకుండా ఎలా ఉంటాయి?" కాఫీ సిప్ చేసి మళ్ళీ అన్నాడు. "నాకు ప్రధమ కోపం ఉంది. ముందు చిరాకు పడి కోప్పడినా, తరవాత చాలా బాధపడతాను. అన్నట్టు మీకు శుభవార్త చెప్పిందా? మీరు తాత, అత్తయ్యగారు అమ్మమ్మ అవుతున్నారు" అని నాంచారమ్మ వైపు చూసి "మీరు తాతమ్మ అవుతున్నారండోయ్" అన్నాడు.

అనుమానాలతో, లక్ష సందేహాలతో, ఏది నిజమో! ఏది అబద్ధమో తెలుసుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న మనసులతో వేడిగా, వాడిగా ఉన్న వాతావరణంలో ఒక్కసారిగా మలయమారుతం వీచినట్టు అయింది. అందరి కళ్ళు పవిత్ర వైపు తిరిగాయి. ఆ మూడు జతల కళ్ళలో కోటి సూర్యప్రభలు వెలిగాయి.

ముందుగా తేరుకున్న వర్ధని పవిత్ర దగ్గరగా వచ్చి, భుజం మీద చేయెసి, "అవునా తల్లి" అంది. పవిత్ర తల వంచుకుంది.

ఒక డాక్టర్ గా నాడి చూసి వైద్యం చేయడంలో నేర్పరి అయిన డాక్టర్ శివకి ఆ ముగ్గురు పెద్దవాళ్ళ నాడి తెలుసుకోడం పెద్ద కష్టం కాలేదు. అందుకే వాళ్ళని ఆనందపరచి, అనుమానాల సెగను చల్లార్చడానికి తనకి అప్రియమైన వార్తని ప్రియంగా చెప్పాడు. ఆ మాత్రం చాతుర్యం లేకపోతే, పవిత్ర అతని వలలో పడేది కాదేమో!

నాంచారమ్మ నోరంతా తెరుచుకుని నవ్వుతూ, "భడవా! ఈ విషయం నాకు చెప్పకుండా, మీ అమ్మా,నాన్నల చెవులు కొరుకుతున్నావా పైన..." అంది అంతకు ముందే పై నుంచి వినిపించిన గుసగుసలకు తనే భాష్యం చెప్పుకుంటూ.

"ఓ చెప్పేసిందా? ఇప్పుడు అర్థం అయింది నాకు తను అలా ఉన్నపాటున పరిగెత్తుకుని వచ్చింది నా మీద అలిగి కాదు, ఈ తీయని కబురు మీకు ఎప్పుడెప్పుడు చెప్పాలా అనే ఆరాటంతో. బాగుంది... సరే, సరే! అత్తయ్యగారూ! మీరు మాకు ఇడ్లి పెడతారో, పెసరట్టు పెడతారో త్వరగా పెడితే, మేము బయలుదేరతాం. నాకోసం రోగులు ఎదురుచూస్తుంటారు." అన్నాడు శివ.

పవిత్ర ఉలిక్కిపడి, తల్లివైపు బెదురుగా చూసింది. ఆవిడ తను అమ్మమ్మ కాబోతున్నాను అనే మైకం నుండి ఇంకా బయటకి రాలేదు. అందుకే పవిత్ర మనసులో మెదిలిన భయం పట్టించుకోలేదు. అల్లుడి మాటలకి చిరునవ్వుతో "రెండూ పెడతాను... మీరు వెళ్లి స్నానం చేసి రండి" అంది.

పవిత్ర వంటగది వైపు వెళ్తున్న తల్లి వైపు నిస్సహాయంగా చూస్తూ సోఫాలోంచి లేవబోయింది. శివ కూడా లేచి, "పద పవిత్రా! నాకు స్నానానికి వేడినీళ్ళు సిద్ధం చేయి." అంటూ కుడిచేత్తో బాగ్ అందుకుని, ఎడమ చేయి ఆమె భుజం మీద వేసి మెట్లవైపు నడిచాడు.

పవిత్ర కొయ్యబారిపోయినదానిలా చలనరహితంగా అతని వెంట నడిచింది. నాంచారమ్మ కొడుకు వైపు చూసి, 'వెళ్ళరా మాధవా! సాంబయ్య కొట్టు తీశాడేమో చూసి, కమ్మని జిలేబీ పట్టుకురా. శుభవార్త విని అలా బెల్లంకోట్టిన రాయిలా కూర్చున్నావేంటి?" అంది.

మాధవకి ఏమి అర్థ కాకుండా మనసు అస్తవ్యస్తంగా ఉంది. సరిగ్గా అరగంట క్రితం కూతురు బావురుమని ఏడుస్తూ చెప్పిన విషయం విన్నాక ఆవేశంతో రగులుకుపోయాడు. ఆ క్షణమే అల్లుడు దగ్గరకు వెళ్లి కాలర్ పట్టుకుని లాగి, చెంప పగలగొట్టాలి అనుకున్నాడు. కానీ, కళ్ళ ఎదురుగా అకస్మాత్తుగా అల్లుడు కనిపించడంతో నిరుత్తరుడయ్యాడు. అతన్ని నిలదీయాలని, సరళ ఎవరో, ఆమెకీ అతనికీ ఉన్న సంబంధం ఏవిటో అడగాలి అనుకున్నాడు. గొంతు మూగబోయినట్టు ఒక్క అక్షరం కూడా బయటకు రాలేదు. ఈలోగా పవిత్ర రావడం, ఆమె పట్ల అల్లుడు చూపిన ప్రేమ, శ్రద్ధ ఆయన్ని అవాక్కు చేసింది.

చెట్టంత మనిషి, విద్యావంతుడు అయిన శివాని అంతమాట అడగడానికి నోరు రావడం లేదు. శివ అన్నట్టు పవిత్రది ఇంకా పసిమనసే. పదిహేడేళ్ళు అమ్మా,నాన్నల చాటున గారాబంగా పెరిగి, వయసు మత్తులో ప్రేమలో పడి, తాళి కట్టించుకుని, కాపురానికి వెళ్ళింది కానీ దానికేం తెలుసు అనుకున్నాడు ఆయన. భర్త మీద అపారమైన అనురాగం, ప్రేమా

ఉంది ఆమెకి. ప్రేమ ఉన్నచోట పొసేస్సివ్ నెస్ ఉంటుంది. అతను తనతో కాక మరో స్త్రీతో కొంత సమయం గడపడంతో తట్టుకోలేక వరస కూడా మర్చిపోయి అనుమానం అనే భూతాన్ని మనసులోకి ఆహ్వానించింది.

చాలా మంది ఆడవాళ్ళు అనుమానించడానికి ఎలాంటి నియమాలు పెట్టుకోరు. నోటికి ఏదొస్తే అది మాట్లాడడం, ఎలా అంటే అలా తగాదాలు పడడం, ఆ తరవాత ఏడ్చి, మొత్తుకుని, మొగుణ్ణి కొట్టి మొరపెట్టుకున్నట్టు రభస చేయడం సాధారణం. ఇంకానయం, పవిత్ర మాటలు నమ్మి అతన్ని కోపంగా తూలనాడలేదు. అదే జరిగితే ఎంతపని అయేది. అతను ఏమనుకునేవాడు?

ఆయన తల విదిలించి ఆలోచనలు వదిలించుకుని తల్లి పురమాయించిన పని చేయడానికి, గదిలోకి వెళ్ళాడు బట్టలు మార్చుకోడానికి.

పవిత్ర గదిలోకి వెళ్ళగానే చటుక్కున ఆమెని వదిలి తలుపు వేసి, గొళ్ళెం పెట్టాడు శివ. పవిత్ర పులి గుహలోకి వచ్చిన జింక పిల్లలా వణికిపోతూ అంది "గొళ్ళెం ఎందుకు పెట్టారు?"

అతను ఆమె వైపు పూర్తిగా తిరిగి షర్టు బటన్స్ విప్పుకుంటూ అన్నాడు "ఇప్పుడు నేను బట్టలు మొత్తం విప్పేసి స్నానానికి వెళ్తాను... తలుపులు తెరిచి ఉంచమంటావా?"

పవిత్ర మొహం కోపంతో ఎర్రబడింది.

ఆమె మొహంలోకి మరింత లోతుగా చూస్తూ అన్నాడు "చెప్పేసావా మీ వాళ్లకి. మొత్తం చెప్పేసావా?"

పవిత్ర భయం భయంగా తల వంచుకుంది.

శివ కుడి చేతి చూపుడు వ్రేలితో ఆమె చుబుకం పట్టుకుని పైకెత్తి "ఏమన్నారు వాళ్ళు? నన్ను ఎడాపెడా వాయించేస్తాం అన్నారా? లేక లాయర్ తో మాట్లాడి విడాకులు ఇప్పిస్తా అన్నాడా మీ నాన్న?" అన్నాడు.

వణుకుతున్న పెదవులు బిగబట్టింది పవిత్ర.

"నా ముందు నువ్వు చిన్న పిపీలికం. నీకు వయసు లేదు, బుద్ధి లేదు, బ్రెయిన్ లేదు... నీకున్నది ఒకటే... అనుమానం అనే రోగం. నీ రోగానికి ఎలాంటి మందు వేయాలో తెలిసిన డాక్టర్ నేను ఒక్కన్నే ఈ భారత దేశంలో. కనుక నేను చెప్పినట్టు వింటూ, నేను వేసుకోమన్న మందులు వేసుకుంటూ, నేను పెట్టేది తింటూ నోరు మూసుకుని నా దగ్గర పడి ఉండు. ఈ నోరు తెరిచావా! అది ఎలా మూయించాలో నాకు తెలుసు. పిచ్చి వేషాలు వేసి, ఏమన్నా తెలివితేటలు ప్రదర్శిస్తే నీ తెలివి ఎక్కడ కత్తిరించాలో కూడా నాకు మాత్రమే తెలుసు. ఏంటి అర్థం అయిందా?" కఠినంగా అడిగాడు.

పవిత్ర కళ్ళు నీటితో నిండిపోయి, కన్నీళ్లు చెంపల మీద ధారలు కట్టాయి.

వెక్కుతూ అంది " మీకు ఇష్టం లేనప్పుడు నన్ను వదిలేయచ్చు కదా! ఎందుకు హింసిస్తారు?"

అతను క్రూరంగా నవ్వాడు. "నేను, సరళా జీవితాంతం కలుస్తూ ఉండాలి అంటే, మాకో లైసెన్స్ కావాలి. ఆ లైసెన్స్ నువ్వు. నువ్వు లోకం దృష్టిలో నా భార్య... కానీ నాకు సుఖాన్ని ఇచ్చేది సరళ. ఆమెని నా భార్యగా లోకం అంగీకరించదు

కాబట్టి, లోకం అంగీకరించని సంబంధం వలన నాకు గౌరవం ఉండదు కాబట్టి, నేను గౌరవంగా బతకాలంటే నువ్వు భార్యగా ఉండాలి... నా కోరికలు తీర్చడానికి సరళ కావాలి... అప్పుడప్పుడు కొందరు తరళలూ కావాలి. ఆ ఎంజాయ్ మెంట్ కి నువ్వు కేంద్ర బిందువు కావాలి. అయినా ఇలాంటి విషయాలు నీరు అర్థం కావడానికి నీ వయసు సరిపోదు. అందుకే నేను చెప్పినట్టు నువ్వు మసలుకో. లేదంటే..." కళ్ళు చికిలించి చూస్తూ, తర్జని చూపించాడు.

గట్టిగా ఏడవబోతున్న పవిత్ర నోరు తన చేత్తో మూసి, "చంపేస్తాను. నీ కళ్ళల్లో నీళ్ళు కనిపించకూడదు... నీ మొహంలో దిగులు కనిపించకూడదు. నేను స్నానం చేసి వచ్చేలోగా నీ బాగ్ సర్దుకో. మీ అమ్మ పెట్టె అట్లు తిని బయలుదేరదాము." కర్కశంగా చెప్పి బాత్ రూమ్ లోకి వెళ్ళాడు.

పవిత్ర కుప్పకూలిపోయింది. గుండె పగిలి దుఃఖం ప్రవాహంలా మారుతోంటే, మోకాళ్ళ మధ్యలో మొహం దాచేసుకుని, కుడిచేత్తో నోరు గట్టిగా మూసుకుని కుళ్ళి, కుళ్ళి ఏడవసాగింది.

సరిగ్గా ఐదు నిమిషాల్లో అతను స్నానం చేసి, టవల్ కట్టుకుని వచ్చి, బాగ్ లో నుంచి పాంట్ షర్టు తీసుకుని బట్టలు వేసుకున్నాడు. మోకాళ్ళ మధ్యలో తలపెట్టుకుని నిశ్శబ్దంగా రోదిస్తున్న పవిత్ర భుజాలు పట్టి మొరటుగా పైకి లేపి, కళ్ళు తుడుచుకుని, "కంటి నిండా కాటుక పెట్టుకో. నీ కళ్ళల్లో దుఃఖం మీ వాళ్ళు పసిగట్టారా జాగ్రత్త" అని హెచ్చరించాడు.

పవిత్ర బలవంతంగా కన్నీళ్లు ఆపుకోడానికి ప్రయత్నిస్తూ బాత్ రూమ్ లోకి వెళ్లి చల్లని నీళ్ళతో మొహం కడుక్కుంది.

అతను చెప్పినట్టే, కళ్ళ నిండా కాటుక పెట్టుకుని, బాగ్ సర్దుకుని అతని ముందు తలవంచుకుని నిలబడింది.

"గుడ్" అంటూ ఆమె భుజం మీద చేయి వేసి నడిపిస్తూ గది బయటకు నడిచాడు.

వాళ్ళిద్దరూ అలా పక్కపక్కన నడుస్తూ కిందకి వస్తుంటే నాంచారమ్మ మొహం వెలిగిపోయింది.

ఎంత అందమైన జంట! అనుకుంది.

"రండర్రా... రండి. కూర్చోండి. వర్దనీ! వాళ్లకి టిఫిన్ పెట్టు " అంది.

వర్ధని "అలాగే" అని సమాధానం ఇచ్చింది.

శివ నాంచారమ్మ పక్కన నేల మీద కూర్చుని, "మీ ఆరోగ్యం ఎలా ఉంది?" అనడిగాడు ఆవిడ ఎడం చేయి అందుకుని పల్స్ చూస్తూ.

ఆవిడ మురిసిపోయింది. "నాకేం నాయనా! దిబ్బరొట్టెలా ఉన్నాను దిట్టంగా" అంది.

"అలాగే ఉంటారు. కానీ లోపల వయసుతో పాటు కొన్ని రుగ్మతలు మొలకెత్తుతుంటాయి. బి.పి ఉన్నట్టుందిగా మీకు. మందులు వేసుకుంటున్నారా క్రమం తప్పకుండా"

"నువ్వుండగా నాకేం లోటబ్బాయ్. లే సోఫాలో కూర్చో మీ అత్తగారు పెసరట్లు తెచ్చింది." అంది ఆవిడ.

"ఏం? ఇక్కడ కూర్చుని తినకూడదా?" అన్నాడు చనువుగా.

"అయ్యో ఎందుకు తినకూడదూ! ఇక్కడే ఇవ్వవే అబ్బాయికి" అంది వర్ధనితో.

"పవిత్రకి కూడా ఇక్కడే ఇవ్వండి. పవిత్రా! రా, రా మీ నానమ్మ పక్కన కూర్చుని తిను" అని పిలిచాడు శివ.

పవిత్ర మౌనంగా వచ్చి కూర్చుంది.

పెసరట్టు ముక్క తుంచి అల్లం పచ్చడిలో నంచుకుని నోట్లో పెట్టుకుని "ఆహా ఏమి రుచి!" అన్నాడు శివ లొట్టలేస్తూ.

వర్ధని మురిసిపోతూ రెండు ఇడ్లి కూడా నేతిలో ముంచి మరీ వేసింది.

ఇంతలో మాధవ లోపలికి వచ్చి, "అమ్మా! నువ్వేంటి సాంబడికి కబురు చేసావా కొట్టు తీయమని. నేను వెళ్లేసరికి తీయడం, వేడి జిలేబీలు చేయడం అన్నీ అయ్యాయి. ఇదిగో" అంటూ తల్లికి పొట్లం ఇచ్చాడు.

"ఎందుకు తీయడు! ఎనిమిది కాకుండానే తీస్తాడు. ఇవాల్టి వాడా ఏం సాంబడు. నా చిన్నప్పటి నుంచీ వాడిది అదే కొట్టు, అదే వ్యాపారం" అని అల్లుడి ప్లేట్ లో జిలేబీ వేస్తూ "తీయని కబురు చెప్పావయ్యా. నూరేళ్ళు చల్లగా బతుకు" అంటూ దీవించింది నాంచారమ్మ.

"ఓ జిలేబీనా. నాకు చాలా ఇష్టం " అంటూ జిలేబీ కొరికాడు శివ.

ఆవిడ మనవరాలి నోటికి జిలేబీ అందిస్తూ " గుమ్మడి పండులాంటి పాపాయిని కను" అంది దీవిస్తూ.

"ఒడ్డున్నే తీపి అంటే నాకు ఇష్టం లేదు అని తెలుసుగా నానమ్మా. నాకొద్దు" అంది పవిత్ర మొహం తిప్పుకుంటూ.

"నాకు తెలుసు. అయినా ఈ సమయంలో ఈ చిన్న ముక్క తిను." అంటూ బలవంతంగా చేతిలో ముక్క పవిత్ర నోటిలో పెట్టింది నాంచారమ్మ.

"అమ్మాయిని నాలుగు రోజులు ఉంచుకుని పంపిస్తాలే బాబూ! నేనూ, మీ మావగారూ వచ్చి దింపుతాం" అంది వర్ధని.

"ఇంకో నాలుగు నెలల్లో మీ దగ్గరకే తను వస్తుంది కదండీ. మళ్ళీ పాపాయికి మూడోనెల వచ్చాకేగా నా దగ్గరకు వచ్చేది. అప్పుడు ణాలు, పాపాయి పుట్టాక మూడు, ఏడు నెలలు మీ దగ్గరే ఉంటుంది. తను లేకుండా నేను ఉండలేను. ఈ నాలుగు నెలలు నా దగ్గర ఉండనివ్వండి. నాకంటి రెప్పలా చూసుకుంటాను మీ అమ్మాయిని. నన్ను నమ్మండి" అన్నాడు శివ ఎంతో వినయంగా.

"కానీలే వర్ధనీ! ఇప్పుడు వెళ్ళనీ, వచ్చేనెల నువ్వే వెళ్లి నాలుగురోజులు వాళ్ళ దగ్గర ఉండి దానికేం ఇష్టమో అన్నీ వండి పెడుదువుగాని" అన్నాడు మాధవ.

శివ నోట్లో పెట్టుకోబోతున్న అట్టు ముక్క జారి పడింది. తేరుకుని నవ్వుతూ "అదే కరెక్ట్" అన్నాడు శివ.

"సరే అయితే" అంది వర్ధని.

కూతురుకి బొట్టు పెట్టి, జార్జెట్ చీర చేతిలో పెట్టి, జాగ్రత్తగా ఉండు. అబ్బాయితో చిన్న పిల్లలా కజ్జాలు పెట్టుకోకు " అని హెచ్చరించింది వర్ధని. మాధవ పవిత్రని దగ్గరగా తీసుకుని నెమ్మదిగా అన్నాడు. "దిగులు పెట్టుకోకు. నీకు ఎప్పుడు ఏది కావాలన్నా నాకు కాకితో కబురంపినా వచ్చేస్తా" అన్నాడు మాధవ అభయం ఇస్తూ.

నానమ్మ కాళ్ళకి నమస్కరించింది పవిత్ర. "గుర్తు పెట్టుకో గుమ్మడి పండులాంటి పాపాయి కావాలి నాకు" అంది నాంచారమ్మ.

పవిత్ర పల్చగా నవ్వింది.

అందరూ గేటు బయటకి వచ్చి, వాళ్ళని కారు ఎక్కించారు.

కదులుతున్న కారులో నుంచి, చేయి ఊపుతున్న ఆ ముగ్గురూ నీళ్ళు నిండిన పవిత్ర కళ్ళకి, మసక మసగ్గా, అస్పష్టంగా కనిపించారు.

స్పష్టంగా, తనకి ఎంతో భద్రతని కల్పించే అమ్మా,నాన్నలు నానమ్మ తన జీవితంలో నుంచి అతి త్వరలో అస్పష్టమైన రూపాల్లాగే మిగిలిపోనున్నారు అన్న విషయం తెలియని పవిత్ర కళ్ళు మూసుకుని సీటులో వెనక్కి వాలి "దేవుడా! నన్ను మళ్ళీ నా వాళ్ళ దగ్గరకి చేర్చు." అని ప్రార్ధించింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS